
నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
10 మహబూబ్‌నగర్, ఆదివారం 16 మార్చి 2025 JOGULAMBA GADWAL WANAPARTHY

### ఆత్మహత్యలే శరణ్యం అంటున్న అన్నదాతలు



మండలంలోని బాడుగదిన్నె గ్రామానికి చెందిన బైరపోగు అశోక్ అనే రైతు బాడిగదిన్నె తండాకు చెందిన మాణిక్యమ్మ శంకర్ అనే రైతుల వద్ద వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. తండా శివారులో 1.20 ఎకరంలో నువ్వులు పంట 2 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. వ్యవసాయ బావిలో ఎండల తీవ్రతకు నీళ్లు అడుగంటి ఎండిపోవడంతో పంటకు పసరిపడా నీళ్లు అందటం లేదు. రూ.వేల పెట్టుబడులు పెట్టి పంటలు వేస్తే తమ కండ్ల ముందే ఎండిపోతుండడంతో తట్టుకోలేకపోతున్నాం. అధికారులు, మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే స్పందించి పంటలు ఎండిపోకుండా నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలి.

హన్మంతునాయక్ అనే రైతు 5 ఎకరాలలో మామిడి తోటను సాగు చేశాడు. 350 ఫీట్ల వరకు బోరు డ్రిల్లింగ్ చేసినా చుక్క నీళ్లు పడలేదు.నీటి సవలతు సక్రమంగా లేక చేతికి వచ్చిన వరి పంట ఎండిపోతున్నది. బావిలో ఉన్న నీళ్లు పంట మొత్తానికి సరిపోవడం లేదు. వరి నాట్లు వేసినప్పుడు బావిలో నీళ్లు మస్తుగా ఉన్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో నీళ్లు పాతాళానికి ఇంకి పోయాయి. రెండు మూడు రోజులు ట్యాంకర్‌తో నీళ్లు పారించినా పారడం లేదు. ఇంక చేసేదేమీలేక వదిలేశాను. అధికారులు ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి. అదే విధంగా నర్సింహా నాయక్ ఎకరంలో వరి చేతికొచ్చే దశలో నీళ్లు అందక ఎండిపోతున్నది. మరో రైతు శంకర్‌నాయక్ మూడెకరాలలో మామిడి, సపోట సాగు చేశాడు. బోరులో నీళ్లింకి పోవడంతో చేసేదేమీ లేక వదిలేశాడు. కాగా శంకర్‌నాయక్, హన్మంతునాయక్ ఇద్దరు రైతులు మిగిలిన తరి పొలాలను కౌలుకు ఇచ్చి హైదరాబాద్‌కు వలస వెళ్తామని కన్నీటి పర్యంతమయ్యారు.



కోడేరు మండలం బాడుగదిన్నెతండా వద్ద ఎండిపోయిన వరిచేనులో రైతు హనుమంతునాయక్



మక్తల్‌లో కాంగ్రెస్ సర్కారు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ప్రశ్నిస్తే సస్పెన్షన్ చేస్తారా?

- **కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ నేతల ఫైర్**
- **మక్తల్ అంతర్రాష్ట్ర రహదారిపై రేవంత్ సర్కారు దిష్టిబొమ్మ దహనం**

మక్తల్, మార్చి 15 : అసెంబ్లీ సమా వేశాల్లో ప్రజా సమస్యలపై ప్రశ్నించగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ సర్కారు తీరును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం మక్తల్‌లోని జాతీయ రహదారి 167పై కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలిచ్చి నేడు వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేసినందుకు ఎమ్మెల్యేను సస్పెండ్ చేయడం చేతగాని తనానికి నిదర్శనమన్నారు. నిండు సభలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని, అతడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు. ప్రతిపక్షాలను అణచాలని చూస్తే ప్రజలు క్షమించరని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆశిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, శంకర్, సుధాకర్‌రెడ్డి, మహెమూద్, మన్నాన్, నరసింహారెడ్డి, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, అమ్రేశ్, ఉమాశంకర్ గౌడ్, ఆనంద్, అస్గర్‌అలీ, ఆనంద్, బాలప్ప, సాధిక్, రఘు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లోని గాంధీ చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- **కేసీఆర్‌ను అవమానిస్తే గొప్పోడివైపోవు..**
- **తెలంగాణ సాధించిన వ్యక్తిని విమర్శిస్తే సహించేది లేదు..**
- **బీఆర్‌ఎస్ నాయకుల హెచ్చరిక**
- **ఆత్మకూర్‌లో గంటపాటు నిరసన**

అమరచింత, మార్చి 15 : ఎన్నో ఏండ్ల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ర్టాన్ని సాధించిన కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి మార్చురీకి పంపిస్తామని అధికార మదంతో అనుచిత వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ సమాజం సహించదని, వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ ఆత్మకూర్ మండలాధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ రాష్ట్ర కమిటీ, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని, కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో గంటపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ 60ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు అలుపెరగని పోరాటంతో పాటు26రోజుల పాటుఆమరణ నిరాహారదీక్ష చేస్తే ఇదే కాంగ్రెస్ పెద్దలు దిగొచ్చి తెలంగాణను ఇచ్చారన్నారు. చావుకు తెగించి కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ర్టానికి ముఖ్యమంత్రి అయ్యి నేడు కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించబోరన్నారు. అనంతరం ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు గ్రూప్స్ ఫలితాలను నిలిపివేయాలని వారం రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులకు బీఆర్‌ఎస్ తరఫున మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చెన్నయ్య, రామకృష్ణ, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, ఆరేపల్లి పీఏసీసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రియాజ్‌అలీ, సీనియర్ నేత మాసన్న పాల్గొన్నారు.

## సమస్యలపై సర్కారుకు స్పందనేదీ?

- శాసన మండలి సమావేశంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



శాసన మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్, మార్చి 15 : నడిగడ్డ ప్రజల సమస్యలపై సీఎం, మంత్రులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శాసన మండలి సమావేశంలో ఎమ్మెల్సీ చల్లా శనివారం నడిగడ్డ ప్రజల సమస్యలపై గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ప్రజా సమస్యలపై ప్రాధాన్యత లేక పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం పనులు చేస్తున్నామని చెబుతున్నారే తప్పా సంపూర్ణంగా చేయడం లేదన్నారు. ఆరోగ్యశ్రీ బీమా సేవలను సరిహద్దు ప్రాంతంలో ఉన్న కర్నూల్ దవాఖానలో వర్తింపజేయాలని కోరారు. ఏపీ రాష్ట్రంలో ప్రజలు కర్ణాటకలోని బెంగుళూరు, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ వంటి దవాఖానలో బీమా వర్తింపజేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అందుకు సంబంధించిన జీవో కాపీలను ఆరోగ్య శాఖ మంత్రికి ఎమ్మెల్యే విజయుడు ద్వారా అందించినట్లు వివరించారు. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేదన్నారు. అలాగే రుణమాఫీ విషయంలో అలంపూర్ రైతులకు సమీపంలోని కర్నూల్ పట్టణ బ్యాంకుల్లో ఖాతాలున్నాయని, కేసీఆర్ హయాంలో అక్కడున్న బ్యాంక్ ఖాతాల్లో కూడా రుణమాఫీ వర్తింపజేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ కాలేదన్నారు. సంబంధితశాఖ మంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. పైగా రుణమాఫీ కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పంటలను మార్కెట్‌కు తీసుకుపోవడానికి సరైన రోడ్లు లేవన్నారు. గ్రామాల అభివృద్ధి కుంటుపడిపోయిందని తెలిపారు. మంత్రులు, సీఎంకు సమస్యలు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని వెల్లడించారు.

## నిలువురాళ్లను పరిశీలించిన అధికారులు



నిలువురాళ్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కృష్ణ, మార్చి 15 : నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని ముడుమాల్‌లో చారిత్రకమైన నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా తాత్కాలిక చాబితాలో చోటు లభించింది. దీంతో స్థానిక ఆర్డీవో రాంచంద్రయ్య, తాసీల్దార్ వెంకటేశ్‌తో కలిసి శనివారం నిలువురాళ్ల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు, మట్టి తరలించడం చేపట్టరాదని హెచ్చరించారు. మంత్రి జూపల్లి కృష్ణరావు ఈ నెల 16వ తేదీన నిలువురాళ్లను సందర్శిస్తారని, ఈ మేరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రాంలాల్ తెలిపారు.



కోడేరు మండలం బాడుగదిన్నె తండాలో అడుగంటిన వ్యవసాయబావి

# జలం ఇంకి.. పంట ఎండి..

- **తడారుతున్న పొలాలు తల్లడిల్లుతున్న రైతులు**
- **కేఎల్‌ఐ కాల్వల్లో నీళ్లు నిల్**
- **ఎడాపెడా కోతలతో కాలిపోతున్న మోటర్లు**
- **కందనూలులో అడుగంటిన భూగర్భ జలాలు**
- **పశువులకు మేతగా వరి పంటలు**

మూసాపేట(అడ్డాకుల), మార్చి 15 : అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లిలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మరో వైపు కరెంటు కోతలతో బోరు బావుల్లో సాగునీరు అందక ఆరుగాలం కష్టించిన పండించిన పంట కండ్ల ముందే కనుమరుగవుతున్నది. మరో వైపు కేఎల్‌ఐ ద్వారా సాగునీరు వస్తుందనుకున్న అన్నదాతలకు నిరాశే మిగిలింది. తిమ్మాయిపల్లిలో రాత్రి 11:30గంటల నుంచి వ్యవసాయ బోరు మోటర్లకు విద్యుత్ సరఫరా చేసేవారు. 15రోజులుగా మధ్యరాత్రి దాటిన తర్వాత 1:30గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తుండడంతో నీళ్లు పారించక పంటలు ఎండుముఖం పట్టినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇచ్చిన అరకొర విద్యుత్‌లో మధ్యలో కోతలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7గంటలు దాటిందంటే చాలు ఎప్పుడు జంఫర్ పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. కరెంట్ సరఫరా సరిగా రాక పోవడంతో తరుచూ వ్యవసాయ బోరు మోటర్లు కాలిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు.

**వంతుల వారీగా బోరు నీళ్లు**

గ్రామానికి చెందిన రైతు రవి, కురుమ్మయ్యతో పాటు మరో 5మంది రైతులకు కలిపి ఒకే ఒక్క బోరు ఉన్నది. వారంతా వంతుల వారీగా బోరు నీరు పారించుకుంటున్నారు. అయితే వారి పొలం దగ్గర్లోనే కేఎల్‌ఐ నుంచి వచ్చే సాగునీటి కాల్వ ఉన్నది. కాల్వ ద్వారా సాగునీరు రాక పోవడంతో రైతులు వంతుల వారీగా వ్యవసాయ బోరును రైతులకు ఒక్కతడికి వారం రోజులు పడుతున్నది. ఆ సమయంలో మోటరు కాలిపోతే మరో 3,4 రోజులు పెరుగుతున్నది.

దీంతో పంటలు ఎండుముఖం పట్టాయి. అలాగే రవి అనే రైతుకు ఉన్న 20గుంటల వరి పంట మొత్తం ఎండిపోయిందని, కుర్మయ్యకు చెందిన 10గుంటల వరకు వరి ఎండిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చేసేది లేక రైతులు ఎండిన పంటలను గొర్రెలు మేపుతున్నారు. కేఎల్‌ఐ క్వాలల ద్వారా సాగునీరు వస్తే కొంత మేర క్రైా బయటపడతామని, లేదంటే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు.



తిమ్మాయిపల్లి శివారులో ఎండిపోయిన రైతు కుర్మయ్య వరి పంట

## అడుగంటిన బావి.. ఆవిరైన ఆశలు

- **ఆందోళనలో కోడేరు మండల రైతులు**

కోడేరు, మార్చి 15 : చెంతనే కృష్ణా నదీ జలాలు గల గలా పారుతున్నా తమకు మాత్రం సాగునీళ్లు అందడం లేదు.. కనీసం చెరువులు కుంటలన్నా నింపుకుందామనుకున్నా కాల్వలు లేకపాయే.. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి సేద్యం చేస్తు ప్రతీసారి సాగు చేసిన పంటలకు పెట్టుబడులు ఎల్లక తీవ్రంగా నష్టపోతున్నామని నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం బాడుగదిన్నెతండా రైతులు వాపోతున్నారు. తమ తండాకు కూతవేటు దూరంలో సింగోటం రిజర్వాయర్ ఉన్నా సాగునీటికి నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగోటం రిజర్వాయర్ నుంచి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న బాడుగదిన్నె గ్రామం తోపాటు తమ తండాకు సాగునీటిని అందించటానికి పాలకులకు చేతులు రావటం లేదని విమర్శిస్తున్నారు. గతంలో పసుపుల పాన్‌గల్ బ్రాంచి కాల్వను మండలంలోని నర్సాయపల్లి, కొర్లకుంట, బాడుగదిన్నె, బాడుగదిన్నెతండా, గుట్టమీదితండా శివారు వరకు కాల్వను తవ్వి వదిలేశారు. అలాగే జూరాల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించటానికి వీపనగండ్ల మండలం కొర్లకుంట మీదుగా కోడేరు మండలం నర్సాయపల్లి, ఎత్తం శివారు వరకు కాల్వలు తవ్వారు. కనీసం జూరాల కాల్వనన్నా పూర్తి చేస్తే సింగోటం రిజర్వాయర్ నుంచి సాగునీరు అందే అవకాశం ఉంది. ఎంజీకేఎల్‌పీ ప్రాజెక్టులో భాగమైన పసుపుల, పాన్‌గల్ బ్రాంచి కాల్వను పూర్తి చేసినా తమకు సాగునీళ్లు అందుతాయని అధికారుల పాలకుల నిర్లక్ష్యం వల్ల కాల్వలు అసంపూర్తిగా వదిలేయటంతో తాము అన్ని రకాలుగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీళ్లు రాక ఎండిపోయిన ఎంజీకేఎల్‌ఐ కాల్వ

### వ్యవసాయం అంటేనే భయమైతంది



వ్యవయసాయం చేయాలంటేనే భయమేస్తుంది. బుధవారం పట్టణ కేంద్రంలో వ్యవసాయం ఎట్లా ఉందని నమస్తే తెలంగాణ విలేకరి అడుగగా.. తనను పొలం వద్దకు తీసుకు పోయి సాగుచేసిన ఐదెకరాల పొలాన్ని చూపించా. ఐదెకరాలలో వరి సాగుచేస్తే, రెండున్నర ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. ఇందుకు దాదాపు మొత్తం రూ.లక్ష పైనే ఖర్చులు అయింది. మిగిలిన రెండున్నర ఎకరాలు కూడా పండుతుందో, ఎండుతుందో తెలియని పరిస్థితి. ఈ సంవత్సరం ఎక్కువగా వర్షం కురిసింది. పంటలు బాగా పండుతాయనే ఆలోచనతో ఐదు ఎకరాల వరి సాగుచేసి, తీవ్రంగా నష్టపోయా. భూగర్భజలాలు అడుగంటడమే ఇందుకు కారణం. గత ప్రభుత్వ(బీఆర్‌ఎస్) హయాంలో ఇంత నష్టం రాలేదు. ఈ ప్రభుత్వానికి ముందుచూపు లేక పోవడం తోనేపంటలు నష్టపోతున్నాం.

**- సత్తూర్ సత్తయ్యగౌడ్, రైతు, భూత్పూరు**

### నీటి సమస్య వాస్తవమే..

ఈ ఏడాది నీటి విడుదలలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం డీ-31 కాల్వ వరకే ప్రతి మంగళ, బుధవారాల్లో వారబంధిపై సాగునీటిని విడుదల చేస్తున్నాం. డీ-32 నుంచి 38 వరకు రైతులు నీటి విడుదల చేయాలంటూ కోరుతున్నా నీటి లభ్యత లేదు.

**- సిద్ధయ్య, ఏఈ**

## వారబంధితో పంటలు ప్రశ్నార్థకం?

- **చేతికిరాని వేరుశనగ, కూరగాయల సాగు**
- **బోరుబావుల్లో తగ్గిన ఊట**
- **జూరాల ఆయకట్టు అన్నదాతల ఆవేదన**

ఇటిక్యాల, మార్చి 15 : జూరాల ఆయకట్టు కింద వారబంధిపై సాగునీటి విడుదలతో పంటలు ఎండిపోతున్నాయంటూ జూరాల ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఏటా ఏప్రిల్, మే నెల వరకు సాగునీరు అందేదని, ప్రస్తుతం వారబంధితో ప్రతి మంగళ, బుధవారం రెండు రోజుల పాటు డీ-31 వరకు నీటిని విడుదల చేస్తుండటంతో ఆయకట్టు కింద సాగుచేసిన వేరుశనగ, కూరగాయల పంటలసాగు ఆందోళనకరంగా మారింది. ఎర్ర గరప నేలలు కావడం వల్ల ప్రస్తుతం తీవ్రమవుతున్న ఎండలకు రోజువిడిచి రోజు నీరందిస్తేనే పంటలు కాపాడుకుంటామని తెలిపారు. బోరుబావులు ఊట తగ్గిపోయి మరింత ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. ప్రతి వేసవిలో కూరగాయలకు ధర బాగుంటుందని ఈ ఏడాది కూడా కూరగాయలు సాగు చేయగా, జనవరి నుంచే వారబంధి ప్రకటించి తమ కడుపుకొట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





వారబందితో నీటి లభ్యత లేని జూరాల ఆయకట్టు సోమనాద్రి ప్రధాన కాల్వ

నీటితడి అందక వాడిపోతున్న మిర్చి తోట

## సెంట్రల్ యూనివర్సిటీ భూములమ్మితే సహించేది లేదు

- బీఆర్‌ఎస్‌వీ పీయూ కన్వీనర్ భరత్‌బాబు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా యూనివర్సిటీ ఎదుట ఆందోళన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 15 : సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని బీఆర్‌ఎస్‌వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ భరత్‌బాబు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని 400ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలను నిరసిస్తూ శనివారం పీయూ ఎదుట బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భరత్‌బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా అప్పులు చేస్తూ.. ప్రభుత్వ సంపదను పెంచుకోవడం కోసం వర్సిటీ భూములను అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటన్నారు. భూములను వేలం వేయడమంటే రాష్ట్ర ప్రభుత్వ విలువను బజార్లో పెట్టి అమ్ముకోవడమే అవుతుందన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని 1970 ప్రాంతంలో కేంద్రం హెచ్‌సీయూను ఏర్పాటు చేయగా, ఆ భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ అమ్మాలనుకోవడం దారుణమైన చర్యగా అభివర్ణించారు. బీఆర్‌ఎస్ హయాంలో యూనివర్సిటీ భూములను కేసీఆర్ పరిరక్షించారని తెలిపారు. ఉన్న భూములను అమ్ముకుంటూ పోతే వర్సిటీలో కొత్త భవనాలను కట్టడానికి స్థలం అవసరమైతే రేవంత్‌రెడ్డి ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని రద్దు చేసేంత వరకు విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేశ్, ఆంజనేయులు, రామకృష్ణ, మల్లేశ్, శశికుమార్, మల్లే శ్రీరాయుడు, పరశురాముడు, రవీందర్, యామిని, కవిత, మాధవి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.




పీయూ ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

## నీటి సంపులో పడి చిన్నారి మృతి

- మిన్నంటిన తల్లిదండ్రుల రోధనలు

బల్మూరు, మార్చి 15 : నీటి సంపులో పడి చిన్నారి మృతిచెందిన ఘటన బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలో చోటుచేసుకున్నది. మండలంలోని కొండనాగులకు చెందిన సుష్మిత, మహేశ్ దంపతుల కూతురు హన్సిక(2) శనివారం రాత్రి ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలో నీటిసంపులో పడిపోయింది. గమనించని కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా కనిపించలేదు. చివరికి నీటి సంపులో చూడగా పాప కనిపించింది. బయటకు తీసి చూడగా, అప్పటికే మృతిచెందింది. దీంతో పాప తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి



హన్సిక (ఫైల్)